16-03-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - జ్ఞానము యొక్క డిపార్ట్మెంట్ వేరు, యోగము డిపార్ట్మెంట్ వేరు. యోగముతో ఆత్మ సతోప్రధానముగా అవుతుంది, యోగము కొరకు ఏకాంతము అవసరము"

ప్రశ్న:- స్థిరమైన స్మృతిలో ఉండేందుకు ఆధారము ఏమిటి?

జవాబు:- మీ వద్ద ఏమేమైతే ఉందో, దానినంతటినీ మర్చిపోండి. శరీరము కూడా గుర్తుండకూడదు. అంతా ఈశ్వరీయ సేవలో పెట్టండి. ఈ శ్రమనే చేయాలి. ఈ బలిహారము ద్వారా స్మృతి స్థిరముగా నిలువగలదు. పిల్లలైన మీరు ప్రేమగా తండ్రిని స్మృతి చేస్తే, ఆ స్మృతి ద్వారా స్మృతి లభిస్తుంది. బాబా కూడా కరెంట్ ఇస్తారు. ఆ కరెంట్ తోనే ఆయుష్షు పెరుగుతుంది, ఆత్మ సదా ఆరోగ్యవంతముగా అవ్వగలుగుతుంది.

ఓం శాంతి. వాస్తవానికి యోగము మరియు జ్ఞానము - ఇవి రెండు విషయాలు. తండ్రి వద్ద ఈ ఖజానా ఎంతగానో ఉంది, దీనిని పిల్లలకు ఇస్తారు. తండ్రిని ఎవరైతే చాలా స్మృతి చేస్తారో, వారికి కరెంట్ కూడా ఎక్కువ లభిస్తుంది ఎందుకంటే స్మృతి ద్వారా స్మృతి లభిస్తుంది - ఇది నియమము, ఎందుకంటే ముఖ్యమైనది స్మృతి. జ్ఞానం ఎంతగానో ఉంది అంటే దాని అర్థము వారు స్మృతి చేస్తారు అని కాదు. అలా కాదు. జ్ఞానము యొక్క డిపార్ట్మెంట్ వేరు. యోగము యొక్క సబ్జెక్ట్ చాలా పెద్దది, జ్ఞానము యొక్క సబ్జెక్ట్ దాని కన్నా తక్కువ. యోగముతో ఆత్మ సతోప్రధానముగా అవుతుంది ఎందుకంటే ఎంతగానో స్మృతి చేస్తారు. స్మృతి లేకుండా సతోప్రధానముగా అవ్వడం అసంభవం. పిల్లలే రోజంతటిలో తండ్రిని స్మృతి చేయకపోతే ఇక తండ్రి కూడా స్మృతి చేయరు. పిల్లలు బాగా స్మృతి చేసినట్లయితే ఆ స్మృతి వలన తండ్రి స్మృతి కూడా లభిస్తుంది. వారు తండ్రిని ఆకర్షిస్తారు. ఇది కూడా తయారై-తయారుచేయబడిన ఆట, దీనిని బాగా అర్థం చేసుకోవాలి. స్మృతి కొరకు ఎంతో ఏకాంతము కూడా కావాలి. చివరిలో వచ్చేవారిలో ఎవరైతే ఉన్నత పదవిని పొందుతారో, దాని ఆధారము కూడా స్మృతియే. వారికి స్మృతి ఎంతగానో ఉంటుంది. స్మృతి ద్వారా స్మృతి లభిస్తుంది. పిల్లలు ఎంతగానో స్మృతి చేసినప్పుడు తండ్రి కూడా ఎంతగానో స్మృతి చేస్తారు, వారు ఆకర్షిస్తారు. బాబా, దయ చూపించండి, కృప చూపించండి అని అంటారు కదా. ఇందులో కూడా కావాల్సింది స్మృతి. బాగా స్మృతి చేసినట్లయితే దానంతట అదే ఆకర్షణ కలుగుతుంది మరియు కరెంట్ లభిస్తుంది. నేను బాబాను స్మృతి చేసినప్పుడు ఆ స్మృతి పూర్తిగా నిండుగా చేసేస్తోంది అని ఆత్మకు లోలోపల అనిపిస్తుంది. జ్ఞానము ధనము. స్మృతి ద్వారా స్మృతి లభిస్తుంది, దాని ద్వారా ఆరోగ్యవంతముగా అవుతారు, పవిత్రముగా అవుతారు. వారిలో ఎంతటి శక్తి ఉందంటే, దానితో మొత్తం విశ్వమంతటినీ పవిత్రముగా చేస్తారు, అందుకే - బాబా, మీరు వచ్చి పతితులను పావనంగా తయారుచేయండి అని పిలుస్తారు.

మనుష్యులకైతే ఏమీ తెలియదు, కేవలం అలా గట్టిగా మాట్లాడుతూ సమయాన్ని వృధా చేసుకుంటూ ఉంటారు, తండ్రి గురించి వారికి తెలియదు. నవవిధ భక్తిని చేస్తారు, శివుని మందిరములోకి వెళ్ళి కాశీలో కత్తులబావిలో దూకుతారు, కానీ ఏమీ లభించదు. మళ్ళీ వికర్మలు జరగడం ప్రారంభమవుతుంది. మాయ వెంటనే చిక్కుకునేలా చేస్తుంది, ప్రాప్తి అంటూ ఏమీ లేదు. పతిత-పావనుడు ఒక్క తండ్రేనని ఇప్పుడు మీకు తెలుసు. వారిపై బలిహారమవ్వాలి. వారు శివ-శంకరులు ఒక్కరేనని భావిస్తారు. అది కూడా అజ్ఞానమే. ఇక్కడ బాబా పదే-పదే చెప్తారు - 'మన్మనాభవ', నన్ను స్మృతి చేసినట్లయితే మీరు పవిత్రముగా అవుతారు, మీరు మృత్యువుపై విజయాన్ని పొందుతారు. ఇందులో మీరు ఎంతగా ప్రయత్నిస్తూ ఉంటారో అంతగా మాయ విఘ్నాలను కలిగిస్తూ ఉంటుంది, ఎందుకంటే మాయ - వీరు తండ్రిని స్మృతి చేసినట్లయితే నన్ను వదిలేస్తారు అని భావిస్తుంది. ఎందుకంటే, ఎప్పుడైతే మీరు నావారిగా అవుతారో అప్పుడు అన్నింటినీ వదలవలసి ఉంటుంది. మిత్ర-సంబంధీకులు, ధనము మొదలైనవేవీ గుర్తుకు రాకూడదు. ఒక కథ ఉంది, అందులో చేతికర్రను కూడా వదలేయండి అని చెప్తారు. వాళ్ళు అన్ని వస్తువులనూ వదిలింపజేస్తారు కానీ శరీరాన్ని కూడా స్మృతి చేయకండి అని ఎప్పుడూ చెప్పరు. తండ్రి అంటారు - ఈ శరీరము పాతది, దీనిని కూడా మర్చిపోండి, భక్తి మార్గపు విషయాలను కూడా వదిలిపేయండి, పూర్తిగా అన్నింటినీ మర్చిపోండి మరియు ఏవేవైతే ఉన్నాయో వాటన్నింటినీ కార్యములో ఉపయోగించండి, అప్పుడే స్మృతి నిలుస్తుంది. ఒకవేళ ఉన్నత పదవిని పొందాలంటే ఎంతగానో కష్టపడవలసి ఉంటుంది. శరీరము కూడా గుర్తుండకూడదు. అశరీరిగా వచ్చారు, అశరీరిగా అయి వెళ్ళాలి.

తండ్రి పిల్లలను చదివిస్తారు, వీరికి ఎటువంటి కోరికా లేదు, వీరు సేవ చేస్తారు. తండ్రిలోనే జ్ఞానము ఉంది కదా. తండ్రి

మరియు పిల్లల యొక్క ఈ ఆట కలిసి ఉంటుంది. పిల్లలు కూడా స్మృతి చేస్తారు, అప్పుడు తండ్రి కూర్చొని సెర్చ్ లైట్ ఇస్తారు. కొందరు చాలా ఆకర్షిస్తారు, అప్పుడు తండ్రి కూర్చొని లైట్ ను ఇస్తారు, ఒకవేళ చాలా ఆకర్షించకపోతే ఈ బాబా కూర్చొని ఆ బాబాను స్మృతి చేస్తారు. ఏదైనా సమయంలో ఎవరికైనా కరెంట్ ఇవ్వవలసి ఉంటే నిద్ర కూడా ఎగిరిపోతుంది, ఫలానావారికి కరెంట్ ఇవ్వాలి అన్న చింత పట్టుకుంటుంది. చదువుతో ఆయుష్షు పెరగదు, కరెంట్ తో ఆయుష్షు పెరుగుతుంది, సదా ఆరోగ్యవంతముగా అవుతారు. ప్రపంచంలో కొందరి ఆయుష్షు 125-150 సంవత్సరాలు కూడా ఉంటుంది, అంటే వారు తప్పకుండా ఆరోగ్యవంతులుగా ఉంటారు. భక్తిని కూడా ఎంతోమంది చేస్తూ ఉంటారు. భక్తిలో కూడా కొంత లాభముంది, నష్టం లేదు. ఎవరైతే భక్తి కూడా చేయరో వారి మ్యానర్స్ కూడా బాగుండవు. భక్తిలో భగవంతునిపై విశ్వాసం ఉంటుంది, వారు వ్యాపారాలలో అసత్యం, పాపం మొదలైనవి చేయరు, క్రోధం రాదు. భక్తులకు కూడా మహిమ ఉంది. మనుష్యులకు - భక్తి ఎప్పటినుండి ప్రారంభమయ్యింది అన్నది తెలియదు. జ్ఞానము గురించైతే తెలియనే తెలియదు. భక్తి కూడా శక్తివంతమవుతూ ఉంటుంది, కానీ ఎప్పుడైతే జ్ఞానము యొక్క ప్రభావము పడుతుందో, అప్పుడు భక్తి పూర్తిగా తొలగిపోతుంది. ఈ సుఖ-దుఃఖాలు, భక్తి మరియు జ్ఞానము యొక్క ఆట రచింపబడి ఉంది.

మనుష్యులు - సుఖ-దుఃఖాలను భగవంతుడే ఇస్తారు అని అంటారు, మళ్ళీ వారిని సర్వవ్యాపి అని కూడా అంటారు. కానీ, సుఖ-దుఃఖాలు వేర్వేరు. డ్రామా గురించి తెలియని కారణముగా ఏమీ అర్థం చేసుకోరు. ఇంతమంది ఆత్మలందరూ ఒక శరీరాన్ని వదిలి ఇంకొకటి తీసుకుంటారు, ఇది మీకే తెలుసు. సత్యయుగములో మీరు దేహీ-అభిమానులుగా ఉంటారని అనరు. ఈ విధంగా దేహీ-అభిమానులుగా అవ్వండి అని ఇప్పుడు తండ్రి నేర్పిస్తారు.

స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయాలి. పవిత్రముగా అవ్వాలి. అక్కడ ఉన్నది పవిత్రమైన సుఖధామము. సుఖములో ఎవరూ స్మృతి చేయరు. భగవంతుడిని దుఃఖములో స్మృతి చేస్తారు. డ్రామా ఎంత అద్భుతమైనదో చూడండి! దాని గురించి మీకు మాత్రమే నంబరువారుగా తెలుసు. ఈ పాయింట్లు ఏవైతే వ్రాసుకుంటారో, వీటిని భాషణ చేసే సమయంలో రివైజ్ చేసేందుకే వ్రాసుకుంటారు. డాక్టర్లు, లాయర్లు కూడా పాయింట్లు నోట్ చేసుకుంటూ ఉంటారు. ఇప్పుడు మీకు తండ్రి మతము లభిస్తోంది కావున భాషణ చేసే సమయంలో దానిని రివైజ్ కూడా చేయాలి. వీరిలోనైతే తండ్రి ప్రవేశించి ఉన్నారు. తండ్రి మీకు అర్థం చేయిస్తుంటే ఇతను కూడా వింటూ ఉంటారు. వారు పాయింట్లను వినిపించకపోతే మీకు అర్థం చేయించేందుకు నాకు ఏమి తెలుసు? తండ్రి అంటారు - ఇది అనేక జన్మల అంతిమ జన్మ. బ్రహ్మ మరియు విష్ణు చిత్రము కూడా ఉంది. మీరు కేవలం నంబరువారుగా రాజ్యములోకి వెళ్తారు. ఎంతగా స్మృతి చేస్తారో, ధారణ చేస్తారో, అంతగా పదవిని పొందుతారు. తండ్రి అంటారు - నేను గుహ్యాతిగుహ్యమైన విషయాలను వినిపిస్తాను. మీరు కొత్త-కొత్త పాయింట్లను నోట్ చేసుకోండి, పాతవి ఉపయోగపడవు. భాషణ చేసిన తర్వాత - ఈ పాయింట్లను అర్థం చేయించి ఉంటే వారి బుద్ధిలో బాగా కూర్చొని ఉండేది అని గుర్తుకువస్తుంది. మీరందరూ జ్ఞానము యొక్క స్పీకర్లు, కానీ నంబరువారుగా ఉన్నారు. మహారథులు అందరికన్నా బాగా ఉన్నారు. బాబా విషయం వేరు, వీరిలో బాప్ దాదా ఇరువురూ కలిసి ఉన్నారు. మమ్మా అందరికన్నా బాగా అర్థం చేయించేవారు. పిల్లలు సంపూర్ణ మమ్మా యొక్క సాక్షాత్కారాన్ని కూడా చూసేవారు. ఎక్కడైనా అవసరమైతే బాబా కూడా ప్రవేశించి తమ పని చేసేవారు. ఇవన్నీ అర్థం చేసుకోవలసిన విషయాలు. చదువు అనేది ఖాళీ సమయంలో జరుగుతుంది. రోజంతా వ్యాపారాలు మొదలైనవి చేస్తారు. విచార సాగర మంథనము చేయడానికి ఖాళీ సమయము కావాలి, శాంతి కావాలి. ఉదాహరణకు ఎవరికైనా కరెంట్ ఇవ్వవలసి ఉంటే, దీని కోసం మంచి సేవ చేసే బిడ్డ ఎవరైనా ఉంటే, ఆ బిడ్డ వారికి సహాయం చేయాలి, అక్కడ వారి ఆత్మను స్మృతి చేయవలసి ఉంటుంది. శరీరాన్ని స్మృతి చేసి అప్పుడు ఆత్మను స్మృతి చేయాలి. ఈ యుక్తిని రచించాలి. సేవాధారీ పిల్లలకు కష్టమేదైనా ఉంటే వారికి సహాయం చేయాలి. తండ్రిని స్మృతి చేయాలి, ఆ తర్వాత స్వయాన్ని కూడా ఆత్మగా భావిస్తూ ఎంతో కొంత వారి ఆత్మను కూడా స్మృతి చేయాలి. ఇది సెర్చ్ లైట్ ఇవ్వడం వంటిది. అలాగని కేవలం ఒకచోట కూర్చుండిపోయి స్మృతి చేయాలని కాదు, నడుస్తూ, తిరుగుతూ, భోజనం చేస్తూ కూడా తండ్రిని స్మృతి చేయండి. ఇతరులెవరికైనా కరెంట్ ను ఇవ్వవలసి ఉంటే రాత్రివేళలో కూడా మేల్కోండి. ఉదయమే లేచి ఎంతగా తండ్రిని స్మృతి చేస్తారో, అంతగా ఆకర్షణ కలుగుతుంది అని పిల్లలకు అర్థం చేయించారు. బాబా కూడా లైట్ ను ఇస్తారు. పిల్లలకు సెర్చ్ లైట్ ఇవ్వడమే బాబా పని. ఎప్పుడైనా ఎవరికైనా చాలా సెర్చ్ లైట్ ను ఇవ్వవలసి ఉంటే, అప్పుడు బాబాను ఎంతగానో స్మృతి చేస్తారు, అప్పుడు బాబా కూడా సెర్చ్ లైట్ ను ఇస్తారు. అక్కడ ఆత్మను స్మృతి చేసి సెర్చ్ లైట్ ను ఇవ్వవలసి ఉంటుంది. ఈ బాబా కూడా సెర్చ్ లైట్ ను ఇస్తారు, దీనిని కృపే అనండి, ఆశీర్వాదమనే అనండి, ఏమైనా అనండి. సేవాధారులు అనారోగ్యంపాలైతే దయ

కలుగుతుంది. రాత్రివేళ మేల్కొని కూడా వారి ఆత్మను స్మృతి చేస్తారు, ఎందుకంటే ఆ ఆత్మకు శక్తి యొక్క అవసరం ఉంది. స్మృతి చేస్తే వారికి రిటర్న్లో స్మృతి లభిస్తుంది. తండ్రికి పిల్లలపై ఎంతో ప్రేమ ఉంది, అందుకే వారికి కూడా ఆ తండ్రి చేస్తున్న స్మృతి చేరుతుంది. ఇకపోతే జ్ఞానమైతే సహజము, అందులో మాయ విఘ్నాలు కలుగవు. ముఖ్యమైనది స్మృతి, అందులో విఘ్నాలు కలుగుతాయి. స్మృతితో బుద్ధి బంగారుపాత్రగా అవుతుంది, అందులో ధారణ జరుగుతుంది. పులి పాలు బంగారుపాత్రలోనే నిలుస్తాయి అన్న నానుడి కూడా ఉంది. అలాగే ఈ తండ్రి ఇచ్చే జ్ఞాన ధనము కొరకు కూడా బంగారుపాత్ర కావాలి. ఎప్పుడైతే స్మృతియాత్రలో ఉంటారో అప్పుడే అది సంభవమవుతుంది. స్మృతి చేయకపోతే ధారణ జరుగదు. తండ్రి అంతర్యామి అని భావించకండి. ఏదో చెప్తే అది జరుగడం - అది భక్తి మార్గంలో జరుగుతుంది. కొడుకు పుడితే గురువు కృప అని అంటారు. పుట్టకపోతే ఈశ్వరుని రాత అని అంటారు. రాత్రికి, పగలుకు ఉన్నంత తేడా ఉంది. పిల్లలైన మీకు డ్రామా రహస్యాన్ని తండ్రి చాలా బాగా అర్థం చేయించారు. మీకు కూడా ఇంతకుముందు దాని గురించి తెలియదు. ఇది మీ మరజీవా జన్మ. మనం దేవతలుగా అవుతున్నామని ఇప్పుడు మీకు తెలుసు. మీరు ఈ టాపిక్ పై అర్థం చేయించవచ్చు - ఈ లక్ష్మీ-నారాయణులకు రాజ్యము ఎలా లభించింది, మళ్ళీ వారు ఎలా పోగొట్టుకున్నారు? మేము మీకు మొత్తం చరిత్ర, భౌగోళమంతటినీ అర్థం చేయిస్తాము అని చెప్పవచ్చు. ఈ బ్రహ్మా కూడా అంటారు - నేను లక్ష్మీ-నారాయణులను పూజించేవాడిని, గీతను చదివేవాడిని, బాబా ఎప్పుడైతే ప్రవేశించారో అప్పుడు ఇక అన్నింటినీ వదిలేసాను. సాక్షాత్కారం జరిగింది, నన్ను స్మృతి చేసినట్లయితే వికర్మలు వినాశనమవుతాయని బాబా చెప్పారు. ఇందులో గీత మొదలైనవి చదవవలసిన విషయమేమీ లేదు. తండ్రి వీరిలో కూర్చున్నారు, అన్నింటినీ వదిలింపజేసారు. ఆ తర్వాత ఇంకెప్పుడూ శివుడిని దర్శించుకునేందుకు మందిరంలోకి వెళ్ళలేదు. భక్తి విషయాలు ఒక్కసారిగా దూరమైపోయాయి. రచయిత మరియు రచనల ఆదిమధ్యాంతాల జ్ఞానము బుద్ధిలోకి వచ్చేసింది. తండ్రిని తెలుసుకోవడం ద్వారా మీరు సర్వస్వాన్ని తెలుసుకుంటారు. మీరు అద్భుతమైన టాపిక్ లు వ్రాయండి, వాటిని చూసి మనుష్యులు ఆశ్చర్యపోవాలి, వాటిని వినటానికి పరిగెత్తుకుంటూ రావాలి. మందిరాలలోకి వెళ్ళి ఎవరినైనా అడగండి - ఈ లక్ష్మీ-నారాయణులు విశ్వాధిపతులుగా ఉన్నప్పుడు ఇంకే ధర్మమూ ఉండేది కాదు, కేవలం భారత్ మాత్రమే ఉండేది, మరి మీరు సత్యయుగము లక్షల సంవత్సరాలు ఉంటుంది అని ఎలా అంటారు? క్రైస్టుకు 3000 సంవత్సరాల ముందు ప్యారడైజ్ ఉండేది అని అంటున్నప్పుడు, మరి దీనికి లక్షల సంవత్సరాలు ఎలా ఉంటుంది? లక్షల సంవత్సరాలలో లెక్కలేనంతగా, దోమల గుంపు వలె అయిపోతారు. మీరు ఇలా కొన్ని విషయాలను వినిపించినా సరే ఆశ్చర్యపోతారు. కానీ, ఈ కులానికి చెందినవారు ఎవరైతే ఉంటారో వారి బుద్ధిలోనే ఈ జ్ఞానం కూర్చుంటుంది, లేదంటే - బ్రహ్మాకుమారీల జ్ఞానము చాలా అద్భుతమైనది అని అంటారు. దీనిని అర్థం చేసుకునే బుద్ధి కావాలి. ముఖ్యమైన విషయము స్మృతికి సంబంధించినది. స్త్రీ-పురుషులు ఒకరినొకరు స్మృతి చేసుకుంటారు. ఇక్కడ ఆత్మ పరమాత్మను స్మృతి చేస్తుంది. ఈ సమయములో అందరూ రోగులుగా ఉన్నారు, ఇప్పుడు నిరోగులుగా అవ్వాలి. ఈ టాపిక్ ను కూడా పెట్టండి. వారికి ఇలా చెప్పండి - మీరు ఘడియ, ఘడియ రోగగ్రస్థులుగా అవుతున్నారు కదా, మేము మీకు ఎటువంటి సంజీవనీ మూలికను ఇస్తామంటే, మీరు మా మందును బాగా వాడినట్లయితే ఇక ఎప్పుడూ రోగగ్రస్థులుగా అవ్వరు. ఇది ఎంత చౌకయిన మందు? 21 తరాలు సత్య, త్రేతాయుగాల వరకూ రోగగ్రస్థులుగా అవ్వరు. అదే స్వర్గము. ఇటువంటి పాయింట్లను నోట్ చేసి వ్రాసుకోండి. సర్జన్లు అయిన మీ అందరికన్నా కూడా పెద్ద అవినాశీ సర్జన్ మీకు ఎటువంటి మందును ఇస్తారంటే, దాని ద్వారా మీరు భవిష్య 21 జన్మల కొరకు ఎప్పుడూ రోగగ్రస్థులుగా అవ్వరు. ఇప్పుడు ఇది సంగమము. ఇటువంటి విషయాలను విని మనుష్యులు సంతోషిస్తారు. నేను అవినాశీ సర్జన్ ను అని భగవంతుడు కూడా అంటారు. ఓ పతిత పావనా, అవినాశీ సర్జన్, రండి అని వారిని స్మృతి కూడా చేస్తారు. ఇప్పుడు నేను వచ్చాను. మీరు అందరికీ అర్థం చేయిస్తూ ఉండండి. చివరిలో అందరూ తప్పకుండా అర్థం చేసుకుంటారు. బాబా యుక్తులను తెలియజేస్తూ ఉంటారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తండ్రి నుండి సెర్చ్ లైట్ ను తీసుకునేందుకు ఉదయముదయమే లేచి తండ్రి స్మృతిలో కూర్చోవాలి. రాత్రివేళలో మేల్కొని ఇతరులకు కరెంట్ ను ఇస్తూ సహాయకులుగా అవ్వాలి.

2. మీ సర్వస్వాన్ని ఈశ్వరీయ సేవలో సఫలం చేసుకొని ఈ పాత శరీరాన్ని కూడా మరచి తండ్రి స్మృతిలో ఉండాలి. పూర్తిగా బలిహారమవ్వాలి. దేహీ-అభిమానులుగా ఉండే శ్రమ చేయాలి.

వరదానము:- స్వదర్శన చక్రము ద్వారా మాయ యొక్క అన్ని చక్రాలను సమాప్తము చేసే మాయాజీత్ భవ

తమను తాము తెలుసుకోవటము అనగా స్వ దర్శనమవ్వటము మరియు చక్రము యొక్క జ్ఞానాన్ని తెలుసుకోవటము అనగా స్వదర్శన చక్రధారిగా అవ్వటము. ఎప్పుడైతే స్వదర్శన చక్రధారులుగా అవుతారో, అప్పుడు మాయ యొక్క అనేక చక్రాలు స్వతహాగా సమాప్తమైపోతాయి. దేహభానము యొక్క చక్రము, సంబంధాల చక్రము, సమస్యల చక్రము... ఇవి మాయ యొక్క అనేక చక్రాలు. 63 జన్మలు ఈ అనేక చక్రాలలో చిక్కుకుంటూ ఉన్నారు, ఇప్పుడు స్వదర్శన చక్రధారిగా అవ్వటముతో మాయాజీతులుగా అయ్యారు. స్వదర్శన చక్రధారిగా అవ్వటము అనగా జ్ఞాన-యోగాలనే రెక్కలతో ఎగిరే కళలోకి వెళ్ళటము.

స్లోగన్:- విదేహీ స్థితిలో ఉన్నట్లయితే పరిస్థితులను సహజముగానే దాటేస్తారు.